
సాక్షి ఒడిశా

గురువారం । 5 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,49,444లు, వెండి 17.55 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



రాయగడకు మరో క్రైం బ్రాంచ్ బృందం -8లో



ఉత్సవాలకు ఎంపికలు -8లో

న్యూస్‌రీల్

మహిళా ఎస్ఐని వెంబడించిన దుండగులు



శుభశ్రీ నాయక్

భువనేశ్వర్: మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో వెంబడించారు. ఈ మేరకు భువనేశ్వర్ లోని సహీద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ శుభశ్రీ నాయక్ సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా నగరంలోని రిజర్వ్ బ్యారక్ సమీపంలో కొందరు దుండగులు ఆమెను వెంబడించారు. వారిబారి నుంచి తప్పించుకున్న ఆమె.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను గుర్తించేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

పులి, చిరుత చర్మాలు స్వాధీనం



ఎస్‌టీఎఫ్ దళాలు స్వాధీనం చేసుకున్న చర్మాలు

భువనేశ్వర్: బౌధ్ జిల్లాలో పులి, చిరుతపులి చర్మాలను ప్రత్యేక టాస్కు ఫోర్సు వర్గాలు స్వాధీనం చేసుకున్నాయి. బౌధ్ ఫారెస్ట్ డివిజన్ అటవీ అధికారుల సహాయంతో ఎస్టీఎఫ్ బృందం చేపట్టిన దాడుల్లో ఈ చర్మాలు చిక్కినట్లు అధికారులు బుధవారం ప్రకటించారు. పులి, చిరుతపులి చర్మాల అక్రమ లావాదేవీలకు సంబంధించి అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా దాడులు చేపట్టారు. బౌధ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సలుకి వంతెన సమీపంలో ప్రత్యేక టాస్కు ఫోర్స్, అటవీ అధికారులు వన్య ప్రాణుల ఉత్పత్తుల అక్రమ వ్యవహారాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు చర్మాలు, ఒక పులి, మరో చిరుతపులి చర్మాలు, ఇతర పనిముట్లు, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బొడొగాంవ్ పోలీసు ఠాణా పరిధిలోని ఒలొండా గ్రామానికి చెందిన హిమాలయ దాష్‌గా పేర్కొన్నారు. అతనిని బౌధ్ సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు వివరించారు.

మైనర్‌పై అత్యాచారం.. నిందితుడి అరెస్ట్

జయపురం: ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడనే ఆరోపణపై యువకుడిని జయపురం పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈనెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక.. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల గాలించగా, మరుసటి రోజు ఉదయదం తన స్నేహితురాలి ఇంట్లో కనుగొన్నారు. అయితే రాత్రంతా ఎక్కడకు వెళ్లావని తల్లిదండ్రులు ప్రశ్నించినా, సమాధానం చెప్పలేదు. కొంత సమయానికి నాగేష్ ఆచార్య అనే వ్యక్తి తనను బలవంతంగా తీసుకు వెళ్లి, అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించాడని వాపోయింది. దీంతో బాధితురాలి తండ్రి 3వ తేదీన జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు నాగేష్ ఆచార్య(19)ను బుధవారం అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఆధారాలు సేకరించారు.

విజేతలకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న డీఎఫ్ఓ

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్ లబారిసింగిలో ఫ్రీడం(గ్రామీణ వైద్య విద్య, పర్యావరణం అభివృద్ధి ఫౌండేషన్) సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణం, మొక్కలు పెంపకంలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి జిల్లా అటవీశాఖ అధికారి ఆమ్లా నాయక్ బహుమతులు అందజేశారు. అలాగే రామగిరి అటవీ రేంజర్ ప్రదీప్‌కుమార్ ఆచార్య, రామగరి, ఆర్.ఉదయగిరి సమక్షంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు జగబంధు దాస్, ఫ్రీడం ప్రతినిధులు త్రినాథ బిశోయిరత్న, కార్యదర్శి నీలమాధవ నాయక్ పర్యవేక్షించారు.

• క్షతగాత్రులకు అండగా..



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభుజానీ

రోడ్డు ప్రమాదంలో గాయపడి అల్లాడుతున్న బాధితులను ఆదుకొని, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ మానవత్వం చూపారు. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి దుఖాగుడ పంచాయతీ మచ్‌పూర్ వద్ద వెళ్తున్న రెండు బైక్‌లు పరస్పరం ఢీకొన్నాయి. డ్రైవర్లు ఇద్దరూ మైనర్లు కాగా, ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ వెంటనే స్పందించారు. ప్రత్యేక వాహనంలో క్షతగాత్రులను కొరాపుట్ జిల్లా కేంద్రం లోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. తాను కూడా వెనుకే ఆస్పత్రికి చేరుకుని బాధితులకు దగ్గరుండి వైద్యం చేయించారు. తనవంతు ఆర్థిక సాయం అందించి, భరోసా ఇచ్చారు. – కొరాపుట్

• సంరక్షణకు సిద్ధం..

మల్కన్‌గిరి జిల్లా నుంచి హైదరాబాద్‌కు బాల కార్మికులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు చైల్డ్‌లైన్ అధికారులు అప్రమత్తమయ్యారు. తెలంగాణకు చెందిన ఓ కాంట్రాక్టర్ తల్లిదండ్రులకు అధిక డబ్బులు ఆశచూపి, కలిమెల, పొడియా సమితులకు చెందిన 30మంది చిన్నారులను కార్మికులుగా తీసుకు వెళ్లేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు వారందరినీ మంగళవారం రాత్రి బస్సులో తరలిస్తుండగా, పొట్టేరు వద్ద జిల్లా చైల్డ్‌లైన్ అధికారి పుష్పాంజలి బెహరా ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి సంరక్షించారు. బుధవారం ఉదయం చిన్నారుల తల్లిదండ్రులకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు జాగ్రత్తగా చూసుకోవాలని తిరిగి అప్పగించారు. – మల్కన్‌గిరి



బస్టాండ్ వద్ద చిన్నారులతో చైల్డ్‌లైన్ అధికారులు

• క్షయ నివారణకు..



రోగులకు కిట్లు అందిస్తున్న దృశ్యం

రాయగడ జిల్లాలోని గుణుపూర్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(జీఐఈటీ) ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులైన ఇద్దరికి 6నెలలకు సంబంధించిన పౌష్టికాహారం, మందుల కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. జీఐఈటీ రిజిస్ట్రార్ ఎన్‌వీ జగన్నాథరావు వీటిని బాధితులకు అందజేశారు. ప్రధానమంత్రి క్షయరోగ విముక్తి భారత్ అభిజాన్‌లో భాగంగా తమవంతు సహకారంగా వీటిని అందించినట్లు తెలిపారు. ఇకపై గుణుపూర్ సమితిలోని వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి, పౌష్టికాహారం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమలో క్షయరోగ నివారణాధికారి డాక్టర్ మమత సాహు, జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ మహంతి, సస్మిత మహారణా తదితరులు పాల్గొన్నారు. – రాయగడ



భువనేశ్వర్‌లో నెదర్లాండ్స్ పురుషుల హాకీ జట్టు

అడుగు పడింది!

- హాకీ ప్రపంచకప్-2023లో కొత్త ఉత్సాహం
- భువనేశ్వర్ చేరుకున్న నెదర్లాండ్స్ జట్టు
- సాదరంగా ఆహ్వానించిన హాకీ ఇండియా అధికారులు
- అద్భుతమైన ఆటతో అలరిస్తాం: కెప్టెన్ థియరీ

2023 పురుషుల ప్రపంచకప్ జట్ల వివరాలు

గ్రూప్	జట్లు
పూల్ ఏ	అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా
పూల్ బి	బెల్జియం, జర్మనీ, కొరియా, జపాన్
పూల్ సీ	నెదర్లాండ్స్, న్యూజిలాండ్, మలేషియా, చిలీ
పూల్ డి	భారత్, ఇంగ్లాండ్, వేల్స్, స్పెయిన్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ఒడిశా హాకీ పురుషుల ప్రపంచకప్-2023 టోర్నమెంట్‌లో కొత్త ఉత్సాహం నిండింది. పోటీల్లో పాల్గొనేందుకు నెదర్లాండ్స్ పురుషుల హాకీ జట్టు బుధవారం రాష్ట్రానికి చేరుకుంది. ఈ మేరకు భువనేశ్వర్ లోని బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డచ్ జట్టుకు హాకీ ఇండియా అధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు భువనేశ్వర్-రూర్కెలాలో జరగనున్న ప్రపంచకప్ పోటీల్లో మరోసారి కప్ వేటలో ముందడుగు వేసింది. థియరీ బ్రింక్‌మన్ నేతృత్వంలో క్రీడాకారుల బృందం జనవరి 10న రూర్కెలాకు బయల్దేరనుండగా, అప్పటి వరకు స్థానిక కళింగ స్టేడియంలో తమ చివరి సన్నాహాలను పూర్తి చేయనుంది. టోర్నమెంట్‌లో ఈ జట్టు జనవరి 14న తమ మొదటి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.

మూడు సార్లు విజేత..

ఆస్ట్రేలియా, బెల్జియం, నెదర్లాండ్స్, ఇండియా, అర్జెంటీనా, జర్మనీ, న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఫ్రాన్స్, కొరియా, మలేషియా, స్పెయిన్, దక్షిణాఫ్రికా, జపాన్, చిలీ, వేల్స్ జట్లు టోర్నీలో పోటీపడుతున్నాయి. చిలీ, మలేషియా, న్యూజిలాండ్‌లతో పాటు నెదర్లాండ్స్ పూల్ సీలోని మిగతా జట్లతో పోటీ పడనుంది. రూర్కెలాలో జనవరి 14న తొలి మ్యాచ్ మలేషియాతో జరగనుండా, 16న న్యూజిలాండ్‌తో, 19న భువనేశ్వర్‌లో చిలీతో పోటీ పడుతుంది. డచ్ జట్టు 1973, 1990, 1998లో ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో పాటు గత మరో రెండు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. అత్యంత బలమైన జట్టుగా ప్రత్యేకత సంతరించుకుంది.

అతిపెద్ద సవాల్..

జట్టులోని అనుభవరాహిత్యం అతి పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉందని నెదర్లాండ్స్ హాకీ జట్టు చీఫ్ కోచ్ జెరోయెన్ డెల్మీ అభిప్రాయం వ్యక్తం చేశారు. భువనేశ్వర్ చేరుకున్న సందర్భంగా ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఐహెచ్ ఒడిశా హాకీ పురుషుల ప్రపంచకప్-2023లో పలు అద్భుతాలు జరగవచ్చన్నారు. టోర్నీలో సవాళ్లను ఎలా అధిగమిస్తామన్నది ఆసక్తికరంగా మారిందని, తన జట్టుపై పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. ఈసారి తమ జట్టు పూర్తి భిన్నంగా ఉందని, గత ప్రపంచకప్‌లో ఆడిన జట్టుతో ప్రస్తుత ఆటగాళ్లను పోల్చలేమన్నారు. టోర్నమెంట్‌ను ఏ స్థానంలో ముగిస్తామనేదే కీలకమని, ప్రతి మ్యాచ్‌లోనూ ఉత్తమంగా పోరాడాల్సి ఉంటుందని ప్రకటించారు. క్వార్టర్ ఫైనల్ దశ దాటుకొని, సెమీఫైనల్‌కు చేరుకోవడమే మొదటి లక్ష్యంగా నిర్దేశించుకున్నామని పేర్కొన్నారు. ఫైనల్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలని.. ఫైనల్‌కు చేరుకుంటే కచ్చితంగా ట్రోఫీతోనే స్వదేశానికి తిరిగి వెళ్తామని విశ్వాసం వ్యక్తంచేశారు.

శక్తివంచన లేకుండా కృషి చేస్తాం..

నెదర్లాండ్స్ కెప్టెన్ థియరీ బ్రింక్‌మన్ మీడియాతో మాట్లాడారు. 'గత కొన్ని నెలలుగా ట్రోఫీ సాధించే రీతిలో సాధన చేస్తున్నాం. ప్రపంచకప్-2023లో ధీటైన పోటీనిచ్చేందుకు జట్టు పూర్తిగా సిద్ధమైంది. ఇప్పుడే భారత దేశానికి చేరుకున్నాం కనుక మొదటి మ్యాచ్ కోసం మా సన్నాహాలను ప్రారంభించే ముందు కొంత విశ్రాంతి తీసుకుంటాం. మళ్లీ ఇక్కడకు రావడం అద్భుతంగా ఉంది. దాదాపు మూడేళ్ల అనంతరం అభిమానుల ప్రత్యక్ష హాజరు మధ్య ఆడేందుకు సంతోషిస్తున్నా. అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లతో జట్టు సమతూకంగా ఉంది. వారి అద్భుతమైన నైపుణ్యాలతో ప్రత్యర్థులను మట్టి కరిపించే సత్తా చాటుకునే అవకాశం ఉంది. జోరిట్ క్రూన్, జోనాస్ డి గ్యూస్, గోల్‌కీపర్ పిర్మిన్ బ్లాక్ ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్నారు. అంతా ఉమ్మడి ఆటతీరుతో జట్టును విజయ తీరాలకు చేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా'మని వివరించారు.



థియరీ బ్రింక్‌మన్, నెదర్లాండ్స్ హాకీ జట్టు కెప్టెన్

పోలీస్ హెల్ప్‌లైన్ ప్రారంభం

- వాట్సాప్ నంబర్ 7377770070ను సంప్రదించాలి: డీసీపీ

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రారంభం కానున్న ఎఫ్ఐహెచ్ హాకీ పురుషుల ప్రపంచకప్-2023 మ్యాచ్‌లు ప్రత్యక్షంగా తిలకించేందుకు విచ్చేసే క్రీడాభిమానులకు సంపూర్ణ సహాయాన్ని అందించేందుకు జంట నగరాల కమిషనరేట్ పోలీసులు బుధవారం 24/7 హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభించారు. జనవరి 13 నుంచి జనవరి 29 వరకు భువనేశ్వర్, రౌర్కెలా ప్రాంతాల్లో సంయుక్తంగా నిర్వహిస్తున్న హాకీ ప్రపంచ కప్‌కు సంబంధించిన అన్ని రకాల సహాయాన్ని ఈ హెల్ప్‌లైన్ అందించనుంది. ఈ సందర్భంగా భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్‌సింఘ్ మీడియాతో మాట్లాడారు. హాకీ ప్రపంచకప్‌కు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. తొలి అంతర్జాతీయ జట్టు నెదర్లాండ్స్ నగరానికి బుధవారం చేరుకోగా, ఇతర జట్లు మరో 2, 3 రోజుల్లో భువనేశ్వర్ చేరుకోనున్నట్లు వెల్లడించారు. భువనేశ్వర్ లోని కళింగ స్టేడియంలో క్రీడాకారులు తమ ప్రాక్టీస్ ప్రారంభిస్తాయన్నారు. జంట నగరాల కమిషనరేట్ పోలీసులు ప్రారంభించిన వాట్సాప్ హెల్ప్‌లైన్ పోలీ-పోలీస్ హెల్ప్‌లైన్‌గా పేర్కొన్నారు. మ్యాచ్‌ల మస్కట్ పోలీ అయినందున హెల్ప్‌లైన్ నంబర్‌కు ఈ విధమైన పేరు పెట్టామన్నారు. వాట్సాప్ నంబర్ 7377770070 పురుషుల హాకీ ప్రపంచకప్‌కు సంబంధించి రాత్రింబవళ్లు సహాయ సమాచారం అందిస్తుందని ప్రకటించారు. ప్రజలు స్టేడియానికి ఎలా చేరుకోవాలి? తమ వాహనాలను ఎక్కడ పార్క్ చేయాలి, వారి సీట్ల స్థానం, టికెటింగ్, ఇతరేతర మ్యాచ్ సంబంధిత సంబంధించిన సమాచారం సహాయం, సంప్రదింపుల కోసం ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ప్రజలు తమ సందేహాలకు ప్రతిస్పందించడానికి 24/7 యంత్రాంగం అందుబాటులో ఉంటుందని డీసీపీ వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్‌సింఘ్

సేవా పేపరుమిల్లు తెరవాలి

- థాపర్ బోర్డు చైర్మన్‌ను కోరిన ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గగనాపూర్‌లో మూతపడి ఉన్న సేవా పేపరుమిల్లును వెంటనే తెరవాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో థాపర్ బోర్డు చైర్మన్ రాజేష్ భొడేరావును బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు గంటకు పైగా పేపరుమిల్లు పరిస్థితులపై చర్చించినట్లు పత్రికలకు విడుద చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే.. ముందుగా వారికి మిల్లు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని ఇటీవల డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించానని తెలిపారు. అలాగే పాత మిల్లు విస్తరణ, కొత్త ప్లాంట్ ప్రారంభం విషయంపై విన్నవించినట్లు పేర్కొన్నారు. తాను ప్రస్తావించిన అంశాలపై స్పందించిన థాపర్ చైర్మన్.. పేపరు మిల్లును వెంటనే పునరుద్ధరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించారు.



థాపర్ చైర్మన్ రాజేష్ భోడెతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

ఉత్తరప్రదేశ్‌కు పయనం..

జయపురం: కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడోయాత్ర ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతోంది. ఇందులో పాల్గొనేందుకు అసెంబ్లీ కాంగ్రెస్ చీఫ్ విప్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు ముందుగా ఢిల్లీకి, అక్కడి నుంచి పాదయాత్ర ప్రాంగణానికి చేరుకోనున్నట్లు సమాచారం.

దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తాం

- కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో దివ్యాంగులు, దృష్టి లోపం ఉన్నవారిని అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా అన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓఎస్ఆర్టీసీ పాత గ్యారేజ్ వద్ద ఉన్న సమర్థ దివ్యాంగుల కేంద్రంలో లూయీ బ్రెయిల్ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కట్ కట్ చేసిన కలెక్టర్.. అనంతరం మాట్లాడారు. సమర్థ్ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సంతోష్ మహారాణా మాట్లాడుతూ కంప్యూటర్‌లో శిక్షణ అందించి, వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బ్రెయిలీ లిపిలో రూపొందించిన దివ్యాంగుల క్యాలెండర్-2023ను ఆవిష్కరించారు. అలాగే ఇటీవల ఢిల్లీలో జరిగిన పాటలు, వక్తృత్వ పోటీల్లో జిల్లా నుంచి ఆన్‌లైన్‌లో పలువురు పాల్గొనగా, విజేతలకు నిర్వాహకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపినీ చేశారు. వీటిని సబ్ డివిజనల్ సోషల్ సెక్యూరిటీ అధికారి ఉత్సర్ గీతా, ఇతర అధికారుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం చెన్నైకి చెందిన సైట్ సేవర్స్ స్వచ్ఛంద సంస్థ అందించిన బ్రెయిలీ కంప్యూటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ ఉపాధ్యక్షుడు నిరంజన్ బెహరా, సీసీడీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వివిధ సమితిల నుంచి విచ్చేసిన దివ్యాంగులు పాల్గొన్నారు.



దివ్యాంగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పండా



అంధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కంప్యూటర్ పనితీరును కలెక్టర్‌కు వివరిస్తున్న దివ్యాంగుడు

దోపిడీ ముఠా అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ ఉమాశంకర్ సింగ్, వెనుక ముసుగుల్లో నిందితులు

బరంపురం: గంజాం జిల్లా అస్కా పట్టణం సమీపంలోని మహాత్మాగాంధీ రోడ్డులో 2 రోజుల క్రితం జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. కరీనా పాత్రో ఇంట్లో జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దోపిడీ సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను అస్కా పోలీసు స్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలోఎస్‌డీపీఓ ఉమాశంకర్ సింగ్, ఐఐసీ అధికారి ప్రశాంత్‌కుమార్ సాహు వెల్లడించారు. ఈనెల 2న పి.కరీనాపాత్రో ఇంట్లో దుండగులు చొరబడి బంగారం ఆభరణలు, నగదు దోచుకొని పరారయ్యారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టి, ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, విచారించారు. వారి వద్ద నుంచి బంగారం ఆభరణలు, 3 బైక్‌లు, 14 సెల్‌ఫోన్లు, ఒక తుపాకీ, 3 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంజా జిల్లాకు చెందిన గణేష్ దాస్, దిలీప్ సాహు, బినోద్ నాయక్, రాబీంద్ర స్వాయి, సన్యాసీ మున్నీ, చింటు జెన్నా, బరల సాహుగా పోలీసులు వివరించారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



కూరగాయల సాగును పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంపై విస్తత ప్రచారం చేయడంతోపాటు రైతుల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు నార్త్ జోన్ రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. దోమాం పంచాయతీ ఎస్ఎంపురంపేట (మెట్టపేట) గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయల సాగును బుధవారం పరిశీలించారు. కూరగాయల్లో అంతర పంటలు సాగు చేస్తున్న రైతులను అభినందించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.రేవతి, డీఆర్పీ శ్రీనివాస్, లీడ్ ఫార్మర్లు మెట్ట ధనుంజయరావు, సువ్వారి సన్యాసిరావు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతో సమాజ ప్రగతి



వీసీ వెంకటరావుతో భేటీ అయిన సీతారాం తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: బాలల హక్కుల పరిరక్షణతో సమాజ ప్రగతి సాధ్యమని బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. పీఎన్ కాలనీలోని వీసీ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాంతో బుధవారం భేటీ అయ్యారు. విశ్వవిద్యాలయాల నుంచి మేధావుల సూచనలు అవసరమని ఈ సందర్భంగా సీతారాం అన్నారు. భవిష్యత్‌లో వర్సిటీల్లో సదస్సులు నిర్వహించి సూచనలు తీసుకుంటామన్నారు. వీసీ మాట్లాడుతూ.. బాలలకు విద్య, వైద్యం వంటివి అందాలన్నారు. చదువులో విద్యార్థుల డ్రాపౌట్స్ ఉండకుండా చర్యలు అవసరమన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



క్లూస్‌టీంతో కలిసి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాము

కవిటి: మర్రిచెట్టుకు ఉరిపోసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆర్.భైరిపురం శివార్లలోని ఊరి చెరువు సమీపంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం పశువుల్ని మేతకు తీకెళ్లిన స్థానికులు చెట్టుకు వేళాడుతున్న మృతదేహాన్ని చూసి గ్రామ వీఆర్వో ఢిల్లేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కవిటి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కె.రాము సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. స్థానికంగా విచారణ చేసినప్పటికీ మృతుడు ఈ ప్రాంత్రానికి చెందిన వ్యక్తి కాదని తెలపడంతో క్లూస్‌టీంను రంగంలోకి దింపారు. గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకున్న తీరును పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుని వివరాల కోసం ఒడిశా పోలీసులకు కవిటి ఎస్సై సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి భద్రపరిచామని.. వీఆర్వో ఫిర్యాదు మేరకు ప్రాథమికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లావణ్య

సారవకోట: వడ్డినవలస గ్రామానికి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సారవకోట మండలం బెజ్జి గ్రామానికి చెందిన బలగ ఉమ (50) మృతి చెందింది. ఈమె సీపాన వెంకటరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై తిలారు నుంచి బెజ్జి గ్రామం వెళ్తుండగా వడ్డినవలస సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడి పోవడంతో ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయమై అక్కడిక్కడే ఉమ మృతి చెందగా.. వాహనాన్ని నడుపుతున్న వెంకటరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్సై బి.లావణ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సీపాన వెంకటరావు నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడపడం వలన తన సోదరి మృతి చెందిందని మృతురాలి సోదరుడైన కూన వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం ఉమ మృతదేహాన్ని పాతపట్నం ఆస్పత్రికి తరలించారు.

రాయగడకు మరో క్రైం బ్రాంచ్ బృందం

- కటక్ నుంచి చేరుకున్న డీఎస్పీ తపన్ దాస్, సిబ్బంది



మీడియాతో మాట్లాడుతున్న క్రైం బ్రాంచ్ డీఎస్పీ తపన్ దాస్



రాయగడ పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు చేస్తున్న అధికారులు

రాయగడ: రష్యా పౌరుల అనుమానాస్పద మృతి పట్ల ఇప్పటికే కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా రాత్రి కటక్ నుంచి మరో క్రైం బ్రాంచ్ బృందం మంగళవారం రాత్రి రాయగడకు చేరుకుంది. ఆశాఖ డీఎస్పీ తపన్‌దాస్ నేతృత్వంలో ఎస్ఐ, ఏఎస్ఐ, సిబ్బంది ఈ బృందంలో ఉన్నారు. ఇప్పటి వరకు పోలీస్ శాఖ తోపాటు భువనేశ్వర్‌కు చెందిన క్రైం బ్రాంచ్, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేపట్టారు. అయితే విచారణ మరింత వేగవంతం చేసి, మిస్టరీని ఛేదించేందుకు మరో ముందడుగు వేశారు. ఈ క్రమంలో క్రైం బ్రాంచ్ డీఎస్పీ తపన్ దాస్ నేతృత్వంలో బుధవారం నుంచి దర్యాప్తును ముమ్మరం చేశారు. ముందుగా రాయగడ పోలీస్ స్టేషన్ చేరుకొని, అక్కడి అధికారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. సాయి ఇంటర్ నేషనల్ హోటల్‌లో డిసెంబర్ 22న మృతిచెందిన రష్యా పౌరుడు వ్లాదిమర్ బిదానోవ్, 23న ఎంపీ పావెల్ యాంథోమ్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా క్రైం బ్రాంచ్ రెండో బృందం దర్యాప్తులో భాగంగా ముందుగా పోలీసులు దర్యాప్తు చేపట్టిన తీరు, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు, సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం వాటిని తమతె తీసుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ వివేకానంద శర్మను కలిసిన అధికారులు.. కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

దర్యాప్తు కొనసాగుతోంది..

రష్యా పౌరుల మృతి పట్ల దర్యాప్తు మరింత వేగవంతమైందని క్రైం బ్రాంచ్ డీఎస్పీ తపన్ దాస్ మీడియాకు తెలిపారు. ఇప్పటి వరకు క్రైం బ్రాంచ్ డీఎస్పీ సరోజ్‌కాంత్ మహంత, ఇన్‌స్పెక్టర్ మమత పండా నేతృత్వంలో కొనసాగిన దర్యాప్తులో భాగంగా కొన్ని ఆధారాలు సేకరించారని, వాటి ఆధారంగా తమ బృందం భిన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించిందన్నారు. అయితే ఇప్పటికే హోటల్ సిబ్బంది, యజమాని, అంబులెన్స్ డ్రైవర్లను విచారించడం పూర్తయ్యిందని పేర్కొన్నారు. సమస్య కొలిక్కి వచ్చేంత వరకు దర్యాప్తు కొనసాగుతుందని, అవసరమైతే సాక్షులను మరోసారి విచారించేందుకు వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా కేసు పరిష్కారంలో భాగంగా అన్ని రకాల ఆధారాలు, సాక్ష్యాలను తాము స్వాధీనం చేసుకుని, వాటిని ఉన్నతాధికారులకు అప్పగించేందుకు సన్నహాలు చేస్తున్నామని వివరించారు.

రిటైర్డ్ సీఓఎం నివాసాలపై సీబీఐ దాడులు



ప్రమోద్‌కుమార్ జెనా, రిటైర్డు సీఓఎం

భువనేశ్వర్: తూర్పుకోస్తా రైల్వే రిటైర్డు ఉన్నతాధికారి ప్రమోద్‌కుమార్ జెనాకు చెందిన నివాసాలపై సీబీఐ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు చేపట్టారు. భువనేశ్వర్ సహా 4 వేర్వేరు చోట్ల ఈ దాడులు కొనసాగుతున్నాయి. అపరిమిత ఆస్తులు ఆర్జించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు సభ్యుల సీబీఐ బృందం సోదాలు చేపట్టింది. భారతీయ రైలు రవాణాధికారి(ఐఆర్‌ఈఎస్) అయిన ప్రమోద్‌కుమార్ 2005 ఏప్రిల్ 1నుంచి 2020 మార్చి 31వరకు 15 ఏళ్ల వ్యవధిలో ఆదాయానికి మించిన ఆస్తులు కూడగట్టినట్లు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవధిలో అధికారిక లెక్కల ప్రకారం పొదుపు, ఆస్తుల సమగ్ర విలువ రూ.2,36,66,148లు కాగా.. సోదాల్లో వీటి విలువ రూ.4,28,87,553గా తేలింది. ఈ గణాంకాల ప్రకారం తూర్పుకోస్తా రైల్వే చీఫ్ ఆపరేషన్సు మేనేజర్‌గా(సీఓఎం)గా ఉద్యోగ విరామణ పొందిన ప్రమోద్‌కుమార్ జెనా అక్రమంగా అపరిమిత ఆస్తులు ఆర్జించినట్లు ధ్రువీకరించిన సీబీఐ వర్గాలు ఆయనకు వ్యతిరేకంగా ఫిర్యాదు దాఖలు చేశాయి. దీనిపై అధికారికంగా సమాచారం జారీ చేయాల్సి ఉంది.

వేధింపులు తాళలేక..

- డీజీపీ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మాహుతి యత్నం



ఆత్మాహుతికి యత్నించిన మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భువనేశ్వర్: విలేకర్లు, పోలీసులు వేధిస్తున్నారనే ఆరోపణలతో ఓ మహిళ ఆత్మాహుతికి విఫల యత్నం చేసింది. కేంద్రపడా జిల్లా పట్టముండాయికు చెందిన మహిళ బుధవారం ఈ దుశ్చర్యకు సాహసించింది. కటక్‌లోని డీజీపీ కార్యాలయం ఎదుట కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోవడానికి ప్రయత్నించింది. పట్టముండాయికి చెందిన సరోజ్ రథ్ అనే జర్నలిస్ట్ తన ఫోటోలు, వీడియోలతో బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని ఆమె ఆరోపించింది. పలు మార్లు ఫిర్యాదులు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతడికి వంతు పాడుతూ తనను వేధిస్తున్నారని వాపోయింది. దీంతో డీజీపీ కార్యాలయం ఎదుట నిప్పంటించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వివరించింది. కార్యాలయం ఆవరణలో ఉన్న పోలీసులు బాధితురాలిని అదుపులోకి తీసుకుని, ఆస్పత్రికి తరలించారు.

ఉత్సవాలకు ఎంపికలు

- సంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో ఆకట్టుకున్న కళాకారులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క



ప్రసంగిస్తున్న కలెక్టర్ విశాల్ సింగ్



థింసా నృత్యం చేస్తున్న మహిళలు



దంగరీ వాయిద్యంతో గిరిజన నృత్యం

మల్కన్‌గిరి: జిల్లాలో ఈనెల 15 నుంచి 17 వరకు పల్లెశ్రీ మేలా, 18, 19 తేదీల్లో మల్యవంత్ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక భవనంలో గిరిజన నృత్య, సంగీత ప్రదర్శన ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఇందులో బోండా, కోయ, దిదియా, సంతాల్, పర్జ, కందా తదితర గిరిజన తెగలకు చెందిన కళాకారులు పాల్గొన్నారను. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి జిల్లా కేంద్రంలోని జరగనున్న ఉత్సవాల్లో ప్రదర్శనలిచ్చేందుకు అవకాశం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా మల్యవంత్ ఉత్సవ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గిరిజనుల్లో చైతన్యం కోసమే వీటిని నిర్వహిస్తున్నామని, ముందుగా సమితి, అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఆఖరి రోజు భారీ ఎత్తున జరిగే కార్యక్రమాల్లో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన కళాకారులు హాజరై, తమ సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధ్యక్షుడు అద్మర్వా, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సోమారి టంగులు, సబ్ కలెక్టర్ అక్షయ ఖేముండు, డీఐపీఆర్‌ఓ ప్రమీలా మాఝి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేకేలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి, టోర్నీ ప్రారంభిస్తున్న శ్వేతా ద్వివేది



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మహిళా అధ్యక్షురాలు, నిర్వహకులు

రాయగడ: జిల్లా కేంద్రానికి సమీపంలోని జేకే పేపర్ మిల్ ప్రాంగణంలో వివిధ ప్రాంతాల్లోని జేకే పేపర్ మిల్ యూనిట్ల మధ్య క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలను జేకే మహిళా మండలి అధ్యక్షురాలు శ్వేతా ద్వివేది ముఖ్య అతిథిగా హాజరై, బుధవారం ప్రారంభించారు. ఈ టోర్నీలో ప్రొడక్షన్ యూనిట్, సొనగడ్ లోని సెంట్రల్ పల్ప్‌మిల్, గుజరాత్ లోని సీరాపూర్ పేపర్‌మిల్, తెలంగాణా, ఢిల్లీ తదితర యూనిట్లకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈనెల 7వరకు కొనసాగే ఈ టొర్నమెంటులో నిర్ణీత 15 ఓవర్ల మ్యాచ్ జరగనుందని పీఆర్‌ఓ శాఖ(జేకే పేపర్‌మిల్) సిబ్బంది తెలిపారు. ప్రారంభ మ్యాచ్‌లో భాగంగా జేకే పేపర్‌మిల్, ఢిల్లీ హెడ్ క్వార్టర్ జట్లు తలపడ్డాయి. నిర్ణీత 15 ఓవర్లలో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ జట్టు 56 పరుగులు చేయగా.. అనంతరం బరిలోకి దిగిన రాయగడ జేకే జట్టు 7 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసి విజయం సాధించింది.

బీజూ ఆశయాలకు కట్టుబడి ఉంటాం

- నవరంగపూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి



హాజరైన బీజేడీ నాయకులు, కార్యకర్తలు



వేదికపై ఎంపీ రమేష్, కేసీసీబీ అధ్యక్షుడు ఈశ్వర్, ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్

కొరాపుట్: ఉత్కళ వరపుత్రుడు, దివంగత ముఖ్యమంత్రి బీజూ పట్నాయక్ ఆశయాల సాధన కోసం జీవితాంతం కట్టుబడి ఉంటామని నవరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మాఝి అన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని అసెంబ్లీ స్థాయి బీజూ జనతాదళ్ 25వ వార్షికోత్సవ సభలో బుధవారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ చరిత్రలో పార్టీ స్థాపించిన నాటి నుంచి వరుసగా 22 ఏళ్ల అధికారంలో ఉన్న పార్టీ ఏదీ లేదన్నారు. దీనికి కారణం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలేనని తెలిపారు. పథకాలు మరింతగా విస్తరిస్తామని, రాష్ట్రంలో పేదరిక నిర్మూళనకు కృషి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. అలాగే రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకం కావాలని సూచించారు. అంతకుముందు బీజూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు, పార్టీ జిల్లా పరిశీలకుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, జెడ్పీ అధ్యక్షుడు మోతీరాం నాయక్, జిల్లా పరిషత్ సభ్యులు, సమితి చైర్మన్లు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని రైస్‌మిల్లుల సీజ్

మందస: ప్రభుత్వ విధి, విధానాలకు సహకరించని రైస్ మిల్లలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కళాసీలతో సమస్య తలెత్తుతోందనే నెపంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయని నాలుగు మిల్లలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ బుధవారం సీజ్ చేశారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీలో రాధాకృష్ణపురం, సిద్ధిగాం పంచాయతీల్లో పలు రైస్ మిల్లులున్నాయి. గత కొద్ది రోజులుగా మిల్లర్లు, కళాసీల మధ్య నెలకొన్న వివాదాలు పరిష్కారం కావడంలేదు. అయినప్పటికీ, మిల్లర్లు ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు అమ్ముతున్న ధాన్యాన్ని మాత్రం కొనడంలేదు. దీంతో రైతులు పలాస, సోంపేట ప్రాంతాలకు ధాన్యాన్ని తీసుకెళ్లి నష్టపోతున్నారు. ఇటీవల జిల్లా అధికారులు మిల్లర్లు, కళాసీలతో చర్చలు కూడా జరిపారు. కానీ, మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదు. సమస్య తీవ్రత ఎక్కువ కావడంతో రైతుల కష్టాలు ఎక్కువయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ధాన్యం కొనుగోలు సమస్యను వివరించారు. చివరకు జేసీ కలుగజేసుకుని బుధవారం సాయంత్రం పలాస ఆర్డీవో తమరాల సీతారామమూర్తి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రమణ, మందస తహసీల్దార్ బడే పాపారావులతో రాధాకృష్ణపురం సమీపంలోని మిల్లుల వద్దకు చేరుకొని పరిశీలించారు. శ్రీసత్యసాయి మోడరన్ రైస్‌మిల్లు, శ్రీవాసుదేవ మోడరన్ రైస్‌మిల్లు, శ్రీసాయికమల్ మోడరన్ రైస్‌మిల్లు, శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్లులను సీజ్ చేశారు. అధికారికంగా సీల్ వేసి విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. కాగా సమస్య పరిష్కరించాలని పోరాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ గణపతి జేసీని కలిసి మిల్లర్ల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఆర్‌బీకేల ద్వారా కాకండా తక్కువ ధరకు ధాన్యాన్ని అడుగుతున్నారని ఆరోపించారు. బ్యాంక్ గ్యారంటీ కట్టకపోవడంతో ఇంత వరకు ఆర్బీకేలు ఒక్క బస్తా కొనుగోలు చేయలేదని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 80 వేల బస్తాల నిలువ చేసే సామర్థం నాలుగు మిల్లులకు ఉన్నప్పటికీ, ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా మిల్లు సీజ్ వ్యవహారాన్ని అధికారులు బుధవారం రాత్రి పూర్తి చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఎం.నళినీ, డీటీ సంతోష్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ ఎల్.యోగి, ఎంఆర్ఐ సవర చిన్నారావు, బీఎస్‌పురం, సిద్ధిగాం, సొండిపూడి, చీపి, నర్సింగపురం వీఆర్వోలు భవాని, సింహాద్రి, కావ్య, మోహనరావు, గౌరి, సర్పంచ్ గున్న రమణ, యూనియన్ నాయకులు ఉన్నారు.

ద్వాక్రా బజార్ చూసొద్దాం రండి


- జిల్లా కేంద్రంలో కొలువుదీరిన డ్వాక్రా బజార్
- ఆకట్టుకుంటున్న విభిన్న ప్రాంతాల వస్తువులు
- పెరుగుతున్న సందర్శకుల తాకిడి



బుడితి, సారవకోట నుంచి వచ్చిన కంచు సామగ్రి


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద పురపాలక పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్–2023 సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో అన్ని రకాల వస్తువులు లభ్యమవుతుండటంతో కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపిస్తున్నారు. 50కు పైగా ఏర్పాటైన ఈ స్టాల్స్‌లో జిల్లా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో పాటు ఇతర జిల్లాల్లో తయారైన వస్తువులు సైతం అందుబాటులో ఉంచారు.

డ్వాక్రా బజార్..




వేదిక	శ్రీకాకుళంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం
వేళలు	ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు
ఎప్పటి వరకు	ఈ నెల 9వ తేదీ వరకు ప్రతి రోజూ

ప్రధాన స్టాల్స్ ఇవే..



- అనకాపల్లికి చెందిన శ్రీసాయి సూర్య స్వయం శక్తి సంఘం, ఏలూరుకి చెందిన దుర్గా స్వయం శక్తి సంఘం తయారు చేసిన హ్యాండీక్రాఫ్ట్స్.
- కృష్ణా జిల్లా పెనమలూరు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రాంతి, పార్వతి, భార్గవీ సంఘాలు తయారు చేసిన చేనేత వస్త్రాలు.
- పిఠాపురం, ఛాగల్లు సంఘాలు తయారు చేసిన తీపి, కారం తినుబండారాలు.



- నాబార్డు ఆధ్వర్యంలో గిరిజనులు సేకరించిన వివిధ ఉత్పత్తులు, ప్రకృతి మూలికలు, చిరుధాన్యాలు.
- జలుమూరు మండలం గొటివాడకు చెందిన భవాని సంఘం రూపొందించిన రోల్డ్‌గోల్డ్ ఆభరాణాలు.



మాడుగుల హల్వా



- సింగుపురం గ్రామానికి చెందిన శ్రీవిద్యా సంఘం వారు తయారుచేసిన అప్పడాలు, పూతరేకులు.
- శ్యాంపాలెంకు చెందిన గౌరమ్మతల్లి సంఘం తయారు చేసిన చిరుధాన్యాలు, సుంగంధద్రవ్యాలు.
- బుడితిలో తయారుచేసిన కంచు, ఇత్తడి వస్తువులు.
- సారవకోటకు చెందిన లక్కీగ్రూప్ తయారు చేసిన చుప్పులు, చేగోడీలు
- రాజాంకి చెందిన సిరిడీసాయి గ్రూప్ తయారు చేసిన సంప్రదాయ పొంగడాలు.
- కొవ్వాడ మత్స్యలేశం గ్రామానికి చెందిన తిరుమల గ్రూప్ సేకరించిన కొర్రలు, ఊదలు, సజ్జలు.
- మబగాం నుంచి సూర్యోదయ సంఘం ఫ్యాన్సీ ఐటం, ఫొటో లేమినేషన్, గిఫ్ట్ ఆర్టికల్స్.

మహిళాభ్యున్నతే ధ్యేయం..

మహిళలు స్వయం ఉపాధి పొంది, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనేదే ప్రభుత్వ ధ్యేయం. డ్వాక్రా బజార్ల ఏర్పాటుతో వారు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కలుగుతుంది.

– డాక్టర్ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ



గుంటూరు పచ్చళ్లు

- పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వెంకటలక్ష్మి గ్రూప్ అగరబత్తీలు.
- పాతపట్నం బెడ్స్ సంస్థకు చెందిన గృహ అలంకరణ మొక్కలు
- బూర్జ మండలం మామిడివలసకు చెందిన తేనె, చిరుధాన్యాలు
- మందస కొయ్యబొమ్మలు
- వజ్రపుకొత్తూరు ఆర్‌సీపీ మార్టులు
- పలాస జీడిపప్పు..వంగర మాప్‌స్టిక్స్
- ఎస్ఎంపురం నెయ్యి చక్రాలు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి చెందిన సంఘటన జమ్ము నారాయణపురం సమీపంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ సిహెచ్. లక్ష్మణరావు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గౌడవీధికి చెందిన ప్రవీణ్ కుమార్ (23) ఓ థియేటర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 3న ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు తమకు కొంత మందిపై అనుమానం ఉందంటూ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను విచారించారు. స్టేడియం పేట సమీపంలో ఈవెంట్స్ డెకరేషన్ షాపు వద్ద మద్యం సేవించినట్లు, తమ మొబైల్ ఫోన్ ప్రవీణ్ బైక్‌లో ఉండడంతో అతనే దొంగలించాడనుకుని తిట్టి, మందలించి అందరూ వచ్చి రూంలో పడుకున్నట్లు, ఉదయం లేచి చూసేసరికి ఆ వ్యక్తి కనబడకపోయేసరికి, అతని బైక్, ఫోన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు విచారణలో పేర్కొన్నారని తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం జమ్ము నారాయణపురం సమీపంలో ఉన్న చెరువు పక్కన ఉన్న బావిలో ప్రవీణ్ శవమై తేలి ఉన్నట్లు అందుకున్న సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామన్నారు. మనస్తాపం చెంది మృతి చెందాడా? ఎవరైనా కొట్టి చంపేసి, ఊరి చివర బావిలో పడేశారా? అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) పట్టణ కమిటీ రూపొందించిన క్యాలెండర్ – 2023ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ శాఖ కార్యదర్శి చింతల వెంకట సతీష్, జిల్లా కార్యదర్శులు కంది వెంకటరమణ, అసోసియేట్ ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, పట్టణ ఉపాధ్యక్షులు బి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సత్యానంద్, వైఆర్ అనిల్, కె.పెంటం నాయుడు, ఎం.సత్యనారాయణ, కె.ధనుంజయ్‌కుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న రూరల్ ఎస్ఐ

సాలూరు: మండలంలోని శివరాంపురం గ్రామంలో ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న రమణను అదుపులోకి తీసుకుని, 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని అన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతి చెందిన రాంబాబు


పార్వతీపురం: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పార్వతీపురం ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కృష్ణా జిల్లా ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాంబాబు(25) కొందరితో కలిసి కొమరాడ మండలం చినఖేర్జల గ్రామంలో పొలంలో కంచె వేయడానికి పనికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బుధవారం ఉదయం రాయగడ నుంచి వస్తున్న బొకోరా ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఎక్కాడు. రద్దీ ఎక్కువ ఉండడంతో రైలు బోగీ మెట్ల దగ్గర నిలబడి ప్రయాణిస్తుండగా మరిపివలస గ్రామం రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. విజయనగరం జిల్లా ఎస్ఐ రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్‌జైలును సందర్శించిన డీఐజీ



జైళ్ల శాఖ డీఐజీతో జైలు సూపరింటెండెంట్ పాత్రో

బొబ్బిలి: పట్టణంలోని సబ్ జైలును జైళ్ల శాఖ రాజమండ్రి జోన్ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ఫైళ్లను పరిశీలించారు. సబ్‌జైలులో ఎంత మంది రిమాండ్ ఖైదీలున్నారు, వారి ప్రవర్తన, అందజేస్తున్న ఆహారం తదితర విషయాలను తెలుసుకున్నారు. ఆయనతో పాటు సబ్ జైల్ సూపరింటెండెంట్ పాత్రో ఉన్నారు.



జిల్లాలో అటవీ అధికారులు అమర్చిన ట్రాకింగ్ కెమెరాకు చిక్కిన రాయల్ బెంగాల్ టైగర్ చిత్రం

- ఒక చోటకు చేరిన రాయల్ బెంగాల్ టైగర్లు
- నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోనే నాలుగు రోజులుగా సంచారం
- మెంటాడ, బొండపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దులో తిష్ట
- సంగమించే అవకాశం ఉందని అటవీ అధికారుల అంచనా
- కలయిక సఫలమైతే మూడున్నర నెలల్లోనే సంతానోత్పత్తి
- ఒక కాన్పులో 2 లేదా 3 పిల్లలకు జన్మనిచ్చే అవకాశం

జత కట్టాయి..!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాయల్ బెంగాల్ టైగర్లలో ఒకటి ఆడది.. మరొకటి మగది. చెరో వైపు సంచరిస్తూ ఎనిమిది నెలలుగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలను హడలెత్తిస్తున్నాయి. కళ్లాల వద్ద ఆవులు, దూడలను హత మార్చుతూ ఆకలి తీర్చుకుంటున్నాయి. ఇప్పుడా రెండూ ఒక ప్రాంతానికి చేరాయి. అదీ నాలుగైదు కిలోమీటర్ల పరిధిలోకి వచ్చేశాయి. నాలుగు రోజులుగా ఎక్కడా పశువులపై దాడుల్లేవు. అదీగాక ఇది పులులు సంగమించే కాలం కూడా! ఈ పరిస్థితులను బట్టి అవి సంభోగించే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అది సఫలమైతే మూడున్నర నెలల కాలంలోనే రెండు లేదా మూడు పిల్లలకు జన్మనిస్తాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అంతరించిపోతున్న స్థితిలో ఉన్న ప్రాణుల్లో రాయల్ బెంగాల్‌టైగర్లు కూడా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో రెండు మూడు పులిపిల్లలు జన్మిస్తే ఉమ్మడి విజయనగరం జిల్లాలో విశేషమే మరి!

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గత మూడు దశాబ్దాల్లో ఎప్పుడూ పెద్దపులి సంచరించిన దాఖలాలు లేవు. అయితే, గత ఏడాది ఏప్రిల్ నెలలో తొలిసారిగా రాయల్ బెంగాల్ టైగర్ జిల్లాలో కనిపించింది. అదే సమయంలో పొరుగున అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో కూడా పులిదాడులు జరిగాయి. తర్వాత విజయనగరం జిల్లాలో కదలికలను బట్టి రెండు పులులు ఉన్నాయని అటవీశాఖ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఒడిశాలోని అడవుల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా విజయనగరం జిల్లాలోకి అడుగుపెట్టి ఉంటాయని భావిస్తున్నారు.



ప్రస్తుతం రెండు పులులు సంచరిస్తున్న ప్రాంతం

'తోడు'ను వెతుక్కుంటూ...

రాయల్ బెంగాల్ టైగర్లు మన రాష్ట్రంలోని నల్లమల అటవీ ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయి. విశాలమైన శ్రీశైలం అభయారణ్యంలో ఒక్కో పులి 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో సంచరిస్తుంటాయి. ఆ ప్రాంతాన్ని తన రాజ్యంగా భావిస్తుంటాయి. ఆ సరిహద్దు చుట్టూ మలం, మూత్రం విసర్జిస్తుంటాయి. చెట్లకు గోళ్లతో రక్కి గుర్తులు ఏర్పాటు చేస్తుంటాయి. మూత్రం కూడా ఎక్కువ రోజుల పాటు ఘాటు వాసన వస్తుంది. దాన్ని బట్టి మరో పులి ఆ పరిధిలోకి పోదు. అయితే ప్రకృతి ధర్మం ప్రకారం పునరుత్పత్తి కోసం ఆడపులితో జతకట్టడానికి ఆ గుర్తులే ఉపయోగపడుతుంటాయి. సాధారణంగా పులుల్లో ఆగస్టు, సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ వాటి సంభోగ సమయం (మేటింగ్ సీజన్) ఉంటుంది. నాలుగేళ్ల వయసు వచ్చిన తర్వాత నుంచి తోడు కోసం వెతుకుతూ వెళ్తుంటాయి.

ప్రస్తుతం అక్కడే కాపురం...

పులి తొలుత కనిపించిన ఆంద్ర ఫారెస్టు ఏరియా ఒడిశా సరిహద్దుకు సమీపంలోనే ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలానికి సరిహద్దు ప్రాంతమే అదంతా. తర్వాత అరకు అటవీ ప్రాంతం దాటితే ఒడిశా సరిహద్దు ఉంది. తాటిపూడి, ఆంద్ర జలాశయాల చుట్టూ విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలోనే గత ఎనిమిది నెలల్లో ఎక్కువ సార్లు పెద్దపులి సంచారం కనిపించింది. ప్రస్తుతం రెండు పులులు గత నాలుగు రోజులుగా అనంతగిరి మండల సరిహద్దు గ్రామాలైన మూలపాడు, గూడెం, బొండపల్లి మండలంలోని పాత పనసలపాడు, మెంటాడ మండలంలోని పణుకువానివలస గ్రామాల పరిసరాల్లోనే ఉన్నాయి. ఆ ప్రాంతమంతా నాలుగైదు కిలోమీటర్ల విస్తీర్ణంలోనే ఉంది. అక్కడే రెండు పులులు ఏకమయ్యే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. గర్భధారణ జరిగితే వంద నుంచి 110 రోజుల్లోనే పిల్లలకు జన్మనిస్తాయి.

కొత్త సంవత్సరంలో ప్రశాంతం...

డిసెంబర్ ఆఖరి వారంలో అనంతగిరి మండలంలో ఆవుపై దాడి చేసిన తర్వాత కొత్త సంవత్సరంలో ఎక్కడా పశువులపై దాడులు జరగలేదు. కొత్తవలస అటవీ ప్రాంతంలో ఎక్కువ సంచరించింది మగపులి అని, మెరకముడిదాం, బాడంగి, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా తిరిగింది ఆడపులి అని కెమెరాలకు చిక్కిన చిత్రాలను బట్టి అటవీ అధికారులు చెబుతున్నారు. మగ పులి కన్నా ఆడపులే ఎక్కువగా పశువులను హతమార్చింది. ఇప్పటివరకూ 42 పశువులను చంపి తినేసింది. పశువులను నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం రూ.7.42 లక్షలను పరిహారంగా అందజేసింది.

ఏకమయ్యే అవకాశం ఉంది



ఇప్పటివరకూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సంచరించిన రెండు పులులు ఇప్పుడు ఒకే ప్రాంతానికి చేరాయి. దాదాపు నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే ఉంటున్నాయి. ఇది వాటి సంభోగ కాలం (మ్యాటింగ్ సీజన్) కాబట్టి ఏకమయ్యే అవకాశం ఉంది.

– శంబంగి వెంకటేష్, జిల్లా అటవీ అధికారి, విజయనగరం

కొట్లాటలో ముగ్గురికి గాయాలు

గజపతినగరం రూరల్: భూమి తగాదాలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరగడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు గజపతినగరం ఎస్ఐ గంగరాజు బుధవారం తెలిపారు. మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన కుమిలి సూరితో పాటు ఐదుగురు అన్నదమ్ములు గడిచిన కొంత కాలంగా తల్లిదండ్రులు నుంచి వచ్చిన భూములను పంచుకునేందుకు గ్రామ పెద్దలు వద్ద పంచాయితీలో ఒప్పందం కుదుర్చుకున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మిగతా అన్నదమ్ములు సూరి, ఆయన పిల్లలను రావాలని కోరగా వారు భూములు నాపేరున ఉన్నాయని, నేను రావాల్సిన అవసరం లేదని చెబుతూ పలుమార్లు నిరాకరించడంతో మాటమాట పెరిగి తగాదాకు దారి తీసిందని తెలిపారు. ఈ తగాదాలో ముగ్గురికి గాయాలవ్వడంతో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఇరు వర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మన్యం మార్కెట్‌లో

రామఫలాలు

- ఆశాజనకంగా దిగుబడి
- గుత్తుల లెక్కన విక్రయం
- ఒక్కోగుత్తుకు 20 నుంచి 40 వరకు ఫలాలు
- రూ.70 నుంచి రూ.100 మధ్య సైజును బట్టి విక్రయాలు
- సీతంపేట ఏజెన్సీలో సుమారు 50 ఎకరాల వరకు సాగు



సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో రామఫలాల సీజన్ ఆరంభమైంది. సంతలు, మార్కెట్‌ను పంట ముంచెత్తుతోంది. ప్రస్తుతం రామఫలాలకు మంచి గిరాకీ ఉంది. గుత్తుల లెక్కన రామఫలాలను గిరిజనులు విక్రయిస్తున్నారు. ఒక్కో గుత్తిలో 20 నుంచి 40 వరకు రామఫలాలుండగా రూ.70 నుంచి రూ.100 మధ్యన గిరిజనులు అమ్మకాలు జరుపుతున్నారు. వచ్చేనెల వరకు రామఫలాల సీజన్ ఉంటుంది. రామానగరం, దేవనాపురం గూడలు, అక్కన్నగూడ, రాజన్నగూడ, మొగదార, కారెం కొత్తగూడ తదితర గ్రామాల గిరిజనులు ప్రతి సోమవారం సీతంపేటలో జరిగే సంతలో పండ్లను విక్రయిస్తున్నారు. అలాగే, కుశిమి, కోడిశ, శంభాం ప్రాంత వాసులు కుశిమి సంతకు(శనివారం), మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ, కీసరజోడు పంచాయతీల గిరిజనులు మర్రిపాడు (బుధవారం) సంతకు, పొల్ల, టిటుకుపాయి గిరిజనులు దోనుబాయి (గురువారం) సంతకు పంటను తరలిస్తున్నారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సంతకు వచ్చి రామఫలాలు కొనుగోలు చేస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో ఒక్కో గుత్తి రామ ఫలాలు రూ.200ల వరకు ధర పలుకుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. సీతంపేట మండల కొండపోడులో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు విస్తరించి ఉన్నాయి.

సేకరణ కష్టమే



కొండపోడు వ్యవసాయంలో పండే రామ ఫలాల సేకరణ కష్టమే. పండ్లు నిల్వ ఉండవు. మైదాన ప్రాంత వ్యాపారులు నిర్ణయించిన ధరలకు పంటను విక్రయిస్తున్నాం. సీజన్‌లో పంట దిగుబడులు బాగున్నాయి.

– ఎస్.మోజేషు, జోగైనాయుడుగూడ

అదనపు ఆదాయం



సీతాఫలాలు తర్వాత సాధారణంగా వచ్చే పంట రామ ఫలాల చెట్లు కొండపోడులో అక్కడక్కడ ఉంటాయి. వ్యవసాయ పనులు చేసుకుంటూనే సీజన్‌లో సేకరిస్తాం. సేకరించిన వాటిని సంతలకు తెచ్చి విక్రయిస్తాం. తద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది.

– సవర సావిత్రి, కుశిమిగూడ



కొనుగోలు చేసిన రామఫలాలు వ్యాన్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

వంతెన నిర్మాణానికి వడివడిగా అడుగులు

సంతకవిటి :

మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు నుంచి ఆమదాలవలస మండలం ఇసుకలపేట వరకు వంతెన నిర్మాణానికి చర్యలు ముమ్మరమయ్యాయి. నదిపై వంతెన నిర్మాణానికి సంబంధించి ఖర్చు అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర కిందట ఫ్రీ ఎస్టిమేట్ సర్వే చేసింది. ఎక్కడ నుంచి ఎక్కడి వరకు వంతెన నిర్మించాలి.. ఎంత ఎత్తులో వంతెన నిర్మించాలి.. రహదారి సౌకర్యం, భవిష్యత్ వినియోగం తదితర అంశాలపై అంచనాలు వేశారు. అందుకు తగ్గట్టుగా వంతెన నిర్మాణానికి రూ. 87 కోట్లు కావాల్సి ఉందని ఆర్అండ్‌బీ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపింది. 600 మీటర్ల పొడవునా వంతెన నిర్మించేందుకు ఏర్పాటు చేయగా, నాలుగు రోజుల కిందట ఇసుకలపేట వద్ద సాయిల్ టెస్టులు నిర్వహించారు. రెండు రోజులుగా వాల్తేరు వైపు భూసార పరీక్షలు చేస్తున్నట్టు ఆర్అండ్‌బీ జేఈ నాయక్ వెల్లడించారు.

సత్తా చాటిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్స్

- ఆఫ్ సెంచరీలతో రాణించిన కెఎస్.భరత్, జ్ఞానేశ్వర్
- మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత చాటుకున్న హైదరాబాద్



ఆంధ్రా – హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్



రెండవ ఇన్నింగ్స్‌లో 52 బంతుల్లో 70 పరుగులతో నాటౌట్ నిలిచిన ఆంధ్రా బ్యాట్స్‌మెన్ భరత్



రెండవ ఇన్నింగ్స్‌లో 72 పరుగులు సాధించిన జ్ఞానేశ్వర్

విజయనగరం: జిల్లా వేదికగా జరుగుతున్న రంజీ క్రికెట్ మ్యాచ్‌లో రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మెన్స్ సత్తా చాటారు. కెఎస్. భరత్, జ్ఞానేశ్వర్ ఆఫ్ సెంచరీలతో రాణించటంతో రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు నష్టపోయి 230 జోడించింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఆంధ్రా – హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ రెండవ రోజు బుధవారం కొనసాగింది. 30 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 79 పరుగులు నష్టానికి మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు మొత్తం 63.1 ఓవర్లలో 197కు ఆలౌటైంది. జట్టు బ్యాటింగ్‌లో శశాంక్ 47 పరుగులు, తన్మయ్‌అగర్వాల్ 35 పరుగులతో రాణించారు. ఆంధ్రా జట్టు బౌలింగ్‌లో కె.నితీష్‌కుమార్‌రెడ్డి 4 వికెట్లు, కెవి.శశికాంత్ 3 వికెట్లు చేజిక్కించుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 230 పరుగులు జోడించారు. జట్టు బ్యాటింగ్‌లో కెఎస్.భరత్ 52 బంతుల్లో 70 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతుండగా.... సిహెచ్.జ్ఞానేశ్వరావు 96 బంతుల్లో 72 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో హైదరాబాద్ క్రీడాకారుడు రక్షణ్ 18 ఓవర్లలో 3 వికెట్లు కైవసం చేసుకున్నాడు. అంతకు ముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు 135 పరుగులకే ఆలౌటైన విషయం విదితమే.

పాన్ షాప్ దగ్ధం



మంటల్లో కాలి బూడిదైన పాన్ షాప్

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పాన్ షాప్ దగ్ధమైంది. మంగళవారం రాత్రి వరకు కొనసాగిన ఈ దుకాణం బుధవారం తెల్లవారే సరికి కాలి బూడిదైంది. దీంతో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలు... గరివిడి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన ఇ.పార్వతి బతుకు తెరువు కోసం పాన్ షాప్‌తో పాటు టీ దుకాణం నడుపుకుంటుంది. ప్రతీరోజూ మాదిరిగానే మంగళవారం కూడా దుకాణం మూసుకుని ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి దుకాణం మంటల్లో కాలిబూడిదైనట్లు పార్వతి వివరించింది. ఈ ప్రమాదంలో పాన్ షాప్‌లో ఉన్న వస్తువులతో పాటు ఫ్రిజ్, గ్యాస్ పొయ్యి, ఇతర సామగ్రి కాలిపోయిందని రూ.లక్ష వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే కొద్ది కాలం క్రితం తన దుకాణాన్ని తొలగించాలని లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని వంగపల్లిపేట గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు తనను బెదిరించినట్లు ఆమె తెలిపింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించింది.



పొలాల్లో కాలిపోతున్న వరిచేను కుప్పలు

వరిచేను కుప్పలు దగ్ధం

సంతకవిటి : మండలంలో ఎమ్ఆర్ అగ్రహారం పంట పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పంట పొలాల్లో వరి నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉంచిన వావిలపల్లి రమణమ్మ, వావిలపల్లి శ్రీనివాసరావులకు చెందిన రెండెకరాల వరిచేను కుప్పలకు నిప్పు అంటుకుంది. వీటితో పాటు పక్కనే విక్రయానికి సిద్ధం చేసి ఉంచిన 20 బస్తాల ధాన్యం కూడా కాలిపోయింది. మంటలు వ్యాప్తి చెందిన వెంటనే రైతులు గుర్తించి అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పంచాయతీ సర్పంచ్ దాసరి దాలినాయుడు సమాచారాన్ని తహసీల్దార్ ఎ.సులోచనారాణికి అందజేశారు. వీఆర్ఏ సరస్వతి ప్రమాద స్థలానికి చేరుకుని పంట నష్టంపై పరిశీలన చేశారు. రూ. 1.50 లక్షల మేర ఆస్తినష్టం ఉంటుందని ప్రాథమిక నిర్ధారణ చేశారు. ఇదిలా ఉండగా చేతికందిన పంట నష్టపోవడంతో బాధితులు లబోదిబోమంటూ విలపిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా



సంతకవిటి పోలీస్‌స్టేషన్ వద్ద బిళ్లాణి గ్రామస్తుల ఆందోళన

సంతకవిటి : బిళ్లాణి గ్రామస్తులు సంతకవిటి పోలీస్ స్టేషన్ ముందు బుధవారం ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. బిళ్లాణి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కంచర్ల అనిత భర్త కంచర్ల ధనుంజయరావును ఎస్ఐ జనార్ధనరావు కొట్టారని ఆరోపిస్తూ గ్రామస్తులు ధర్నాకు దిగారు. కంచర్ల ధనుంజయరావుకు, ఇజ్జిపేట గ్రామానికి చెందిన చిక్కాల కాశీబాబుకు మధ్య పంట పొలాలకు నీరందించే విషయంలో కొద్ది రోజులుగా వివాదం నెలకొంది. ఈ విషయం గ్రామ పెద్దల వద్ద ఉండగానే రెండు రోజుల కిందట కాశీబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ జనార్ధనరావు ఇరు వర్గాలను పిలిచి సమస్యపై ఆరా తీశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కూడా ధనుంజయరావును స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తుండగా వివాదం రేగింది. ఈ సమయంలో ఎస్ఐకి, ధనుంజయరావుకు మధ్య వాగ్వాదం పెద్దది కావడంతో ధనుంజయరావుపై ఎస్ఐ చేయి చేసుకున్నట్టు బాధిత కుటుంబీకులు ఆరోపిస్తున్నారని రాజాం పట్టణ సీఐ కె.రవికుమార్, రూరల్ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ వివాదం నేపథ్యంలో విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంగళవారం రాత్రి స్టేషన్ వద్ద నిరసనకు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం ఏడు గంటల సమయానికి మళ్లీ స్టేషన్‌కు వెళ్లి ముందు బైఠాయించారు.

ఏజెన్సీ గజగజ



తివ్వాకొండల్లో పరుచుకొన్న మంచు తెరలు



నెగడు మంట ముందు బొడ్డగూడ ఆదివాసీలు

ఏజెన్సీలో చలి పులి పంజా విసురుతోంది. సంక్రాంతి దగ్గర పడుతున్న వేళ చలి మరింత పెరిగి ఏజెన్సీ వాసులను గజగజ వణికిస్తోంది. చలి నుంచి బయటపడేందుకు గిరిజనులు నానా తంటాలు పడుతున్నారు.

- పెరిగిన చలి
- ఏకధాటిగా కురుస్తున్న మంచు
- చలి మంటలతో ఆదివాసీల ఊరట

భామిని: ఏజెన్సీ చలితో వణుకుతోంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. చలికి తోడు తీవ్రంగా మంచు కురుస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీలో బుధవారం 13 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇదే పరిస్థితి సంక్రాంతి వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు స్పష్టం చేయడంతో ఏజెన్సీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పగటి పూట మంచు తెరలు వీడిన తరువాత రోజు వారీ కార్యకలాపాలు ప్రారంభమయ్యే సరికి ఆలస్యమవుతోంది. ఇక రోజూ సాయంత్రం ఐదు గంటలకే మంచు కురవడం ప్రారంభమై వాతావరణం మరింత చల్లబడుతోంది. ఉదయం తొమ్మిది గంటల వరకు సూర్యుడి దర్శనం కరువవుతోంది. దీని ప్రభావంతో కొండకోనల్లో... రహదారులపై ప్రయాణానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తివ్వా కొండ ప్రాంతంలో మంచు విస్తారంగా పరుచుకోవడంతో కొండలన్నీ మంచు దుప్పటి కప్పుకుంటున్నాయి. రోడ్లన్నీ పొగ మంచుతో దర్శనమిస్తున్నాయి.

ఆదివాసీల అవస్థలు

చలి ప్రభావంతో ఆదివాసీలు రక్షణ పొందేందుకు రకరకాల మార్గాలు వెతుకుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలు రాత్రంతా నెగడుల వేడితో ఉపశమనం పొందుతున్నారు. వృద్ధులు, పిల్లలు, చలి మంటలతో ఉపశమనం పొందుతున్నారు. సంక్రాంతి ముందు ఇంటి పనుల్లో తలమునకలైన మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు..

చలి పులి దాడిలో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. గొంతు, ముక్కు వ్యాధులు తీవ్రమవుతున్నాయి. ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధులు, క్షయ వ్యాధిగ్రస్తులు విజృంభిస్తున్నాయి. వాహనదారులకు ప్రయాణ కష్టాలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

తస్మాత్...



చలి తీవ్రతతో అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. ఆస్మా, ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు అవస్థలు పెరగనున్నాయి. చలితో శర్మం పొలుసుబారి చర్మవ్యాధులు పెరగవచ్చు. గతంలో టీబీ ఉన్న బాధితులు అప్రమత్తంగా ఉండాలి. చలి నుంచిరక్షణ చర్యలు చేపట్టాలి. వేడి వాతావరణంలో ఉండాలి. ఉలెన్ దుస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి.శనీరు ఎక్కువగా తాగుతుండాలి. వేడి వేడి ఆహారం, పానీయాలు తీసుకోవాలి.

– డాక్టర్ కె.విజయపార్వతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ